ప్రజాశక్తి
మంగళవారం 21 మే 2024 8 పేజీలు
గుంటూరు పల్నాడు





బడా నేతలను అరెస్టు చేస్తారా?

- పల్నాడు అలర్లలో నిందితులుగా 581 మంది
- సిట్ అధికారుల నివేదికతో చర్యలపై ఉత్కంఠ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్, అనంతరం రెండు రోజుల పాటు పల్నాడు జిల్లాలో జరిగిన హింసాత్మక ఘటనలపై ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు విచారణ చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన నివేదికను సోమవారం ఉన్నతాధికారులకు సమర్పించారు. సిట్ అధికారులు సౌమ్యలత, రమణమూర్తి నరసరావుపేట, మాచర్ల, గురజాల, పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో జరిగిన ఘటలను పరిశీలించారు. మొత్తం జిల్లాలో 22 కేసులు నమోదు అయ్యాయి. 581 మందిని నిందితులుగా గుర్తించారు. 274 మంది నిందితులను ఇప్పటి 2లో



ఈనెల 13న పోలింగ్ సందర్భంగా ఘర్షణలను నియంత్రించే ప్రయత్నంలో పోలీసులు

పల్నాడు ఎస్‌పికి సవాళ్లు

కత్తిమీద సాములా శాంతిభద్రతలు - ఫ్యాక్షన్ సంస్కృతిని నిర్మూలించేనా?

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కక్షలు, కార్పణ్యాలకు, ఫ్యాక్షన్ రాజకీయాలకు, ఆధిపత్యపోరాటాలకు నిలయంగా మారిన పల్నాడు జిల్లాకు అతి తక్కువ కాలంలో మూడో ఎస్‌పిగా నియమితులైన యువ మహిళా ఐపిఎస్ మల్లికాగర్గ్‌కు అనేక సవాళు పొంచి ఉన్నాయి. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ సీనియర్ ఐపిఎస్ అధికారులకు సైతం శిరోభారమైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాకు గతంలో పనిచేసిన ఎస్‌పిలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని ఫ్యాక్షన్ సంస్కృతిని కొంత వరకు నిర్మూలించినా ఈ జాడలింకా తొలగిపోలేదు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఫ్యాక్షన్ సంస్కృతిని పెంచిపోషించడం అనవాయితీగా వస్తోంది.



2003లో పిఎస్‌ఆర్ ఆంజనేయులు ఎస్‌పిగా ఉండగా టిడిపి, కాంగ్రెస్ నాయకులకు లాఠీ కౌన్సెలింగ్ ఇవ్వడం, తరువాత బాంబులను వారి చేతిలోనే పెట్టి ఇప్పుడు పేల్చండి చూద్దాం అని గ్రామాల్లో ముఠాలు నడిపే వారందరికి రోజుల తరబడి కౌన్సెలింగ్ చేయడం ద్వారా చాలాకాలం పాటు బాంబుల సంస్కృతికి తెరబడింది. ఆ తర్వాత వఫ్యాక్షన్ హత్యలు కూడా కొంత కాలం నిలిచి పోయాయి. 2001లో మాచర్లలో ఏడుగురు కాంగ్రెస్ కార్యకర్తల హత్య అప్పట్లో సంచనలం కలిగించింది. తరువాత ఎన్నికలకు ముందు, తరువాత కొన్ని ఘటనలు జరిగినా ఈసారి ఎన్నికల సందర్భంగా జరిగిన హింసాత్మక ఘటనలు 2014, 2019లో కూడా ఈ స్థాయిలో జరగలేదని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

మే 13న పోలింగ్ రోజున, తరువాత రెండు రోజుల పాటు హింసాత్మక ఘటనలు జరిగాయి. ఈ ఘటనలను ఎన్నికల కమిషన్ తీవ్రంగా 2లో

పల్నాడులో మోస్తరు వానలు

దుక్కులకు అవకాశం.. కూరగాయలు, ఉద్యాన పంటలకు మేలు


2లో

నరసరావుపేటలో వాన..

అస్తవ్యస్తంగా గుంటూరు ట్రాఫిక్



- వాహనాల నియంత్రణ కంటే వసూలుపై దృష్టి
- ఏళ్ల తరబడి ఒకే స్థానంలో తిష్టవేస్తున్న సిబ్బంది
- అడ్డదిడ్డంగా వాహనాల రాకపోకలతో ఇబ్బందులు

8లో

ప్రశాంతంగా ఓట్ల లెక్కింపే కర్తవ్యం

- లెక్కింపునకు 700 మందికిపైగా సిబ్బంది
- జిల్లాకు దేశవ్యాప్తంగా చెడ్డపేరు తెచ్చిన ఘర్షణలు
- కారకులపై త్వరలో ఛార్జిషీట్
- సమస్యాత్మక ప్రాంతాల్లో ఓట్ల లెక్కింపు అనంతరమూ భద్రత
- పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లత్కర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే ప్రస్తుతం తమ ముందున్న కర్తవ్యమని పల్నాడు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికలాధికారి లత్కర్ శ్రీకేష్ బాలాజీరావు అన్నారు. కలెక్టర్‌గా ఆదివారం బాధ్యతలు చేపట్టిన ఆయన పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట కలెక్టరేట్‌లో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. 4వ తేదీన నరసరావుపేట మండలంలోని జెఎన్‌టియు కళాశాలలో నిర్వహించే ఓట్ల లెక్కింపై సంబంధిత అధికారులకు త్వరలో శిక్షణిస్తామని చెప్పారు. 4న ఉదయం 8 గంటలకు పార్లమెంట్ స్థానంతోపాటు జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుందని, తొలుత పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుందని చెప్పారు. పార్లమెంట్ స్థానంతోపాటు 7 నియోజకవర్గాలకు సంబంధించి 7+7 మొత్తం అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రంలో 196 టేబుల్ ఏర్పాటు చేస్తామన్నారు. కౌంటింగ్‌లో 700 మందికి పైగా సిబ్బంది పాల్గొంటారన్నారు. కౌంటింగ్ టేబుల్, ఒక పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు టేబుల్ ఏర్పాటు చేస్తామని, ప్రతి టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్వైజర్ కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ బృందంగా పని చేస్తారని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు బృందాలు అందుబాటులో ఉంటాయన్నారు. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే సిబ్బందికి గుర్తింపు కార్డు మంజూరు చేస్తామని, వారు దాన్ని తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుందని చెప్పారు. కలెక్టర్ వెంట 2లో



మాట్లాడుతున్న పల్నాడు కలెక్టర్ శ్రీకేష్ లత్కర్

డ్రోన్లు ఎగురవేయటం నిషేధం

ప్రజాశక్తి-గుంటూరు

ఓట్ల లెక్కింపు కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లలో భాగంగా డ్రోన్లు ఎగురవేయడాన్ని నిషేధిస్తూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారని జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లాలో సార్వత్రిక ఎన్నికల అనంతరం గుంటూరు పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంలు, వివిప్యాట్‌లు భద్రపరచిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌లున్న ప్రాంతంలో మానవ రహిత విమానాలు (డ్రోన్లు) ఎగురవేయడం నిషేధిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. వర్శిటీలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యి, ఈవీఎంలు, వివిఫ్యాట్‌లు కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరచే వరకు ఈ నిషేధపు ఉత్తర్వులు అమలులో ఉంటాయని తెలిపారు.

నరసరావుపేట డీఎస్పీగా సుధాకరరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



నరసరావుపేట డీఎస్పీగా ఎం.సుధాకరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. డివిజన్ పరిధిలో శాంతి భద్రతల స్థాపనకు తన వంతు కృషి చేస్తానని సిబ్బందిని అప్రమత్తంగా ఉంచుతామన్నారు. పోలింగ్ రోజున, అనంతరం ఘర్షణలు తలెత్తిన నేపథ్యంలో ఓట్ల లెక్కింపు సందర్భంలోనూ ఘర్షణలు జరగొచ్చని, వీటికి తావివ్వకుండా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇదిలా ఉండగా డీఎస్పీని పలు స్టేషన్ల ఎస్‌ఐలు, సిఐలు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈవీఎంల ధ్వంసం కేసులో 10 మంది అరెస్టు

ప్రజాశక్తి - రెంటచింతల

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈనెల 13న పోలింగ్ సందర్భంగా జరిగిన ఘటనల్లో పదిమందిని అరెస్టు చేసినట్లు పల్నాడు జిల్లా ఎఎస్‌పి జీవీ రమణమూర్తి తెలిపారు. ఈ మేరకు ఎస్‌ఐ ఎం.ఆంజనేయులుతో కలిసి సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పోలింగ్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడం, ఈవీఎంల ధ్వంసం కేసుల్లో మండంలోని తుమ్మకోటకు చెందిన నలుగురు, జెట్టిపాలేనికి చెందిన ఆరుగుర్ని అరెస్టు చేశామన్నారు. ఎన్నికల కోడ్ ఇంకా అమలులో ఉందని, ఘర్షణలకు దిగకుండా బైండోవర్ చేసిన వారు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. 4న ఓట్ల లెక్కింపు అనంతరం ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించొద్దని చెప్పారు. పెట్రోలు బంకుల్లో లూజు విక్రయాలు చేసినా, బాటిళ్లలో నింపినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాణాసంచా విక్రయించే వ్యాపారులపైనా చర్యలుంటాయన్నారు.

అదుపు తప్పితే అంతే సంగతి

కుంచనపల్లి సర్వీస్ రోడ్డు వేయాలని వినతి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

గత నాలుగు సంవత్సరాలుగా ఎం టి ఎం సీ పరిధిలోని కుంచనపల్లి జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు నిర్మాణానికి నోచుకోక వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి అది రోడ్డులా కాకుండా చిన్నపాటి చెరువును తలపిస్తుంది. అటు విజయవాడ నుండి కుంచనపల్లి వైపుగా కెఎల్‌యుకి వెళ్లే విద్యార్థులు, గ్రామాలకు వెళ్లే రైతులు, కార్మికులు ఆ రోడ్డు వైపున ప్రయాణం చేస్తే, గాయాల పాలవాల్సిందే. ఎక్కడ గుంత ఉందో తెలియని పరి స్థితి. వర్షం కురిసిన ప్రతిసారి ఏదో ఒక వాహనదారుడు గాయాల పాలవుతున్న పరిస్థితి ఏర్పడుతుంది. హైవే అది . కారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి. మరలా గత నాలుగు రోజుల కిందట కురిసిన అకాల వర్షానికి గుంతలన్నీ నిండి రోడ్డు చెరువుల మారింది. రోజు వందల కొద్ది వాహనాలు ఈ మార్గం వైపున కోనేరు లక్ష్మయ్య ఇంజనీరింగ్ కాలేజీకి ప్రయాణం చేస్తూనే ఉన్నాయి. వాహనదారులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కానీ అధికారులు మాత్రం పట్టినట్టు వ్యవహరిస్తున్న తీరు ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తుంది. తక్షణమే కుంచనపల్లి సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, వాహనదారులు ఇబ్బందులకు గురి కాకుండా ఉండేందుకు సత్వరమే ఆగిపోయిన రోడ్డును పూర్తి చేయాలని పలువురు గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

30న డివిఎంసి సభ్యుల రాష్ట్ర స్థాయి సమావేశం

ప్రజాశక్తి-మంగళగిరి

విజయవాడ ప్రెస్ క్లబ్ లో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన రాష్ట్రస్థాయి డివిఎంసి సభ్యుల సమావేశం జరుగుతుందని ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బుల్లా రాజారావు, ఉపాధ్యక్షురాలు నన్నేపాక ప్రశాంతి అన్నారు. ఈ మేరకు మంగళగిరిలో సోమవారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీల అట్రాసిటీ కేసుల, భూ విషయాలు, ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గంపై జరుగుతున్న అత్యాచారాలు, ఫిర్యాదుల కేసులలో తనిఖీ, పర్యవేక్షణ చేస్తూ ప్రభుత్వానికి, ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గాలకు వారధిగా ఉంటున్న కమిటీ సభ్యులకు ప్రభుత్వం నుండి తగిన గుర్తింపు, సౌకర్యాలు లేవన్నారు. ప్రభుత్వం కమిటీ సభ్యుల రెండు సంవత్సరాలు ఉన్న కాల పరిమితిని ఐదు సంవత్సరాలకి పెంచాలని, సభ్యులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులతో పాటు, ఉచితంగా బస్సు పాస్ లు ఇవ్వాలన్నారు.

30 నుండి 2 వరకు
శ్రీ వీరాంజనేయ స్వామి జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి - పొన్నూరు

స్థానిక శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి, శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలోని శ్రీ వీరాంజనేయ స్వామి హనుమ జయంతి మహోత్సవాలు ఈ నెల 30 తేదీ నుండి జూన్ 2 వరకు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి తుల్లిమిల్లి శ్రీనివాస్ సోమవారం తెలిపారు.

ప్రశాంతంగా ఓట్ల లెక్కింపే కర్తవ్యం

(మొదటి పేజీ తరువాయి)

జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం ఉన్నారు.

త్వరగా ఛార్జిషీట్ వేసేలా చర్యలు

ఎన్నికల ఘర్షణలపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోందని, వీటిని ప్రేరేపించిన వారిని గుర్తించి బైండోవర్ చేయడంతో పాటు త్వరగా ఛార్జిషీట్ వేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. పోలింగ్ రోజున పల్నాడు జిల్లాలో 27 ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక ఘటనలతో జిల్లా మొత్తానికి చెడ్డ పేరు వచ్చిందన్నారు. ఓట్ల లెక్కింపు రోజున ఇవి పునరావృతం కాకుండా పోలీసులను అప్రమత్తం చేస్తామని, అనుమానితులను బైండోవర్ చేస్తామని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా 144 సెక్షన్ అమలుతో పాటు ప్రత్యేక భద్రతా చర్యలు చేపడతామన్నారు. కౌంటింగ్ అనంతరం కూడా సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రత కొనసాగుతుందన్నారు.



మూసి ఉన్న టీ స్టాల్



రద్దీగా ఉన్న ఓ హోటల్

చిరువ్యాపారుల ఇబ్బందులు

- 144వ సెక్షన్ అందరికీ వర్తించదా
- పెద్ద హోటళ్లు, బార్ షాపులపై ఆంక్షలు ఉండవా
- ప్రశ్నిస్తున్న చిరువ్యాపారులు?

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిరు వ్యాపారులకు, రోడ్ల పక్కన టిఫిన్ బండ్ల వారికే తప్ప పెద్ద పెద్ద హోటళ్లు, బార్ షాపులకు 144వ సెక్షన్ వర్తించదా అని చిరువ్యాపారులు, ప్రజలు విమర్శిస్తున్నారు. పట్టణంలో 200కు పైగా చిన్న టీ కొట్లు ఉన్నాయి. రోడ్డు పక్కన కూరగాయలు, పండ్లు విక్రయించే వారు ఆంక్షల కారణంగా ఇబ్బంది పడుతున్నారు. విక్రయించే పరిస్థితి లేకపోవడంతో కుటుంబాలు జరగని పరిస్థితి నెలకొందని చిన్నాచితకా వ్యాపారులు వాపోతున్నారు. బార్ షాపులు, పెద్ద వ్యాపారస్తుల దుకాణాలకు 144 సెక్షన్ ఎక్కడా అమలు కావడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పోలీసులు, అధి కారులు స్పందించాలని కోరుతున్నారు. తగు జాగ్రత్తలతో తమ వ్యాపారం కొనసాగించుకునేలా అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


తెరచిఉన్న బార్

పల్నాడు ఎస్‌పికి సవాళ్లు

(మొదటి పేజీ తరువాయి)

పరిగణించింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభంకాగానే టిడిపి, బిజెపి నేతల ఫిర్యాదు మేరకు ఎస్‌పి రవిశంకర్‌రెడ్డిని బదిలీ చేయగా తాజాగా పోలింగ్ రోజున ఘర్షణల నివారించడంలో విఫలమయ్యారనే కారణంతో ఎస్‌పి జి.బిందుమాధవ్‌ను సస్పెండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా పోలింగ్‌కు ముందే 144 సెక్షన్ విధించినా ఘర్షణలను నివారించలేకపోయారు. ఈ అల్లర్లను సీరియస్‌గా తీసుకున్న ఈసీ తాజాగా కొత్తఎస్‌పిగా మల్లికాగర్గ్‌ను నియమించడమూ చర్చనీయాంశంగా మారింది.

మల్లికా గర్గ్ గతంలో ప్రకాశం, తిరుపతికి ఎస్పీగా పని చేశారు. ఈ ప్రాంతాలకు మొదటి మహిళా ఎస్పీ కావటం విశేషం. ఒంగోలులో ఎస్పీగా ఉన్న సమయంలో తప్పు చేసిన హెడ్ కానిస్టేబుళ్ల నుండి ఎస్సై, డీఎస్పీ వంటి అధికారులపైనా మల్లికా గర్గ్ చర్యలు తీసుకున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టి చట్టవ్యతిరేక కార్యాకలాపాలను కట్టడి చేయడానికి ప్రయత్నించగా మూడువారాల్లోనే బదిలీకి గురయ్యారు. వైసిపి నేతల ఫిర్యాదుతో ఆమె బదిలీ జరిగిందని అప్పట్లో ప్రచారమైంది. తిరుపతి నుంచి ఆమెను విజయవాడ సీఐడీ ఎస్పీగా నియమించారు. రాజకీయ నాయకుల సిఫార్సులకు తలొగ్గని అధికారిగా పేరున్న మల్లిక గార్గ్‌ను పల్నాడు ఎస్‌పిగా నియమించడం ద్వారా ఘర్షణలను నివారించేందుకు కొంత మేరకు కఠినంగా వ్యవహరించడానికి అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే వచ్చే ఎన్నికల ఫలితాల తరువాత ఏ పార్టీ గెలిచినా ప్రత్యర్థులపై దాడులకు పాల్పడే అవకాశం ఉందని, మరో నెలరోజుల పాటు బందోబస్తు కొనసాగించాలని నిఘా వర్గాలు హెచ్చరించిన నేపథ్యంలో ఘర్షణలను నివారణ నూతన ఎస్పీక కత్తిమీద సాముగా మారింది.

ఐజీని కలిసిన నూతన ఎస్పీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా ఎస్పీగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన మల్లికా గర్గ్ గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠిని గుంటూరులోని ఐజి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పల్నాడు జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని, ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేటట్లు చూడాలని ఐజి చెప్పారు. పరిపాలనకు సంబంధించి సలహాలు, సూచనలు అందిస్తామన్నారు.


ఐజికి మొక్కను అందజేస్తున్న మల్లికా గర్గ్

బడా నేతలను అరెస్టు చేస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

వరకు గుర్తించారు. ఇంకా 307 మందిని గుర్తించాల్సిఉంది. ఇప్పటి వరకు కేవలం 19మంది మాత్రమే అరెస్టు చేశారు. ఇంకా 471 మందిని అరెస్టుచేయాల్సి ఉంది. 91 మందికి 41ఏ కింద నోటీసులుజారీ చేశారు. వైసిపి, టిడిపి నేతల ప్రమేయంతో దాడులు జరిగాయని సిట్ అధికారుల ప్రాథమిక విచారణలో వెల్లడయినట్టు తెలిసింది. సిట్ అధికారుల విచారణలో పల్నాడు ప్రాంతంలో కొంతమంది కీలకమైన నాయకుల ప్రోద్భలంతోనే అల్లర్లు జరిగాయని గుర్తించారు. వీరిని అరెస్టుచేస్తారా లేదా అన్న ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల రోజు ఘర్షణల అనంతరం గత సోమవారం మధ్యాహ్నం తరువాత ఎన్నికల కమిషన్ జోక్యంతో మాచర్ల, నర్సరావుపేటలో టిడిపి, వైసిపి అభ్యర్థులను గృహ నిర్భంధంలో ఉంచారు. వీరి పేర్లు కూడా విచారణలో పరిశీలనకు వచ్చాయి.

ప్రస్తుతం నమోదు చేసిన 22 ఎఫ్ఐఆర్‌లను ఎంత వరకు సరిగా ఉన్నాయి? ఇంకా ఏమైనా సెక్షన్లు మార్చాలా లేక యథాతథంగా కొనసాగించాలాఅన్న అంశంపై సిట్ అధికారులు పరిశీలించారు. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారులకు కొన్ని సూచనలు చేశారని తెలిసింది. ఈమేరకు పోలీసు స్టేషన్ వారీగా నమోదు అయిన ఎఫ్ఐఆర్‌లు, నిందితులుగా పేర్కొన వారి పేర్లు, నమోదు చేసిన సెక్షన్లు, మార్పు చేయడం, ఇప్పటి వరకు అరెస్టు చేసిన వారి వివరాలను సిట్ అధికారులు తమ నివేదికలో పొందుపర్చారు. ఇంకా ఎవరు ఎవరిని అరెస్టు చేయాల్సిఉందో కూడా నివేదికలో పేర్కొన్నట్టు తెలిసింది. ఈవివరాలను అత్యంత రహస్యంగా ఉంచారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తదుపరి దర్యాప్తు, అరెస్టులు ఉంటాయని భావిస్తున్నారు. మాచర్ల, గురజాల, పెదకూరపాడు, సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల్లో ఈనెల 13, 14, 15 తేదీల్లో ఘర్షణలపై జరిగిన విచారణలపై కూడా టిడిపి,వైసిపి సిట్ అధికారులకు కూడా పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు.రెండుపార్టీల వారు పోలీసు అధికారులపై కూడా ఆరోపణలు చేశారు. దీంతో మరికొంతమంది అధికారులపై కూడా త్వరలో చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అలాగే మాచవరం, కొత్తగణేశునిపాడు, దాచేపల్లిలో జరిగిన ఘటనలపై మానవ హక్కుల కమిషన్, మహిళాకమిషన్‌కు కూడా ఫిర్యాదులు వెళ్లాయి. ఈ మూడు ఘటనల్లో టిడిపి వారిపై వైసిపి ఫిర్యాదులు చేసింది. పెదకూరపాడు మండలంలో అచ్చంపేట, కొత్తపల్లి, వేల్పూరు, దొడ్లేరు, కంభంపాడు, హుస్సేన్ నగరం, ఎర్రబాలెం, చింతపల్లి గ్రామాల్లో జరిగిన ఘర్షణలను కూడా వైసిపి సిట్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లింది.

రాజాధిరాజ వాహనంపై గ్రామోత్సవం

ప్రజాశక్తి -పొన్నూరు

పురాణ ప్రసిద్ధి చెందిన శ్రీ సుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత శ్రీ సాక్షి భావన్నారాయణ స్వామి నవాహిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. సోమవారం ఉదయం 10 గంటలకు పంచామృత స్నపన, తిరువంజోనోత్సవము నిర్వహించారు. రాత్రి 9 గంటలకు శ్రీ భావదేవుడిని రాజాధిరాజ వాహనంపై గ్రామోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. రఘునాథ్ బాబు, పానకాలరావు ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు.

పల్నాడులో మోస్తరు వానలు

దుక్కులకు అవకాశం.. కూరగాయలు, ఉద్యాన పంటలకు మేలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ఆది, సోమవారాల్లో మధ్యాహ్నం వరకు విపరీతమైన ఎండలున్నా మధ్యాహ్నం నుండి ఈదురు గాలులతో పాటు ముసురు వాతావరణం నెలకొంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వాతావరణం చల్లబడడంతో ప్రజలు కాస్త ఉపశమన పొందుతున్నారు. ప్రస్తుత వాన కూరగాయ పంటలకు, రబీలో సాగు చేసిన నూగు, ఇతర ఉద్యాన


నరసరావుపేట పల్నాడు రోడ్డులో ఒక ఇంటిముందు నిలిచిన నీరు...

పంటలతో పాటు పశుగ్రాసం పెరుగుదలకు ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం కురవగా నరసరావుపేటలో 40 నిముషాలకు ఏకబికిన వానకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో పల్నాడు రోడ్డులోని ఒక ఇంటిలోకి నీరు చేరింది. ప్రకాష్ నగర్‌లో రోడ్డును ఆక్రమించి దుకాణం ఏర్పాటు చేయడం డ్రెయినేజీ పూడిపోయి ఇంట్లోకి వర్షపు నీరు వచ్చి ఉండలేని పరిస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రెయినేజీ వ్యవస్థపై మున్సిపల్ అధికారులు శ్రద్ధ పెట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



నిలిచిన వర్షపు నీరుపోయే మార్గంలేక అవస్థలు

ప్రజాశక్తి - మంగళగిరి



మంగళగిరి నగరంలోని దేవ స్థానం వీధిలో చిన్నపాటి వర్షానికే రోడ్లపై నీరు నిలిచిపోతుంది. సోమ వారం కురిసిన వర్షానికి రోడ్డుపై నీరు నిలిచి అటు వాహన దారులు, ఇటు పాదచారులు ఇబ్బం దుల ఎదుర్కొంటున్నారు. వర్షానికి ఎగువ ప్రాంతం నుండి వచ్చిన నీరు నేరుగా ప్రధాన మురుగు కాలువలోకి చేరలేకపోవడంతో తరచుగా ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. ఎంటిఎంసీ అధి కారులు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



గేదెలను రైల్వే పట్టాలపైకి వదలొద్దు

రైల్వే ప్రమాదాలపై గేదేల కాపరులకు అవగాహన

ప్రజాశక్తి-పెదకూరపాడు

గేదెలను రైల్వే పట్టాలపై వదలకూడదని గుంటూరు రైల్వే పోలీస్ ఫోర్సు కోరారు. సోమవారం పెదకూరపాడు లో రైల్వే రైల్వే పట్టాల పక్కన నివాసం ఉండే వారికి, గేదెల కాపరులకు రైల్వే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. గేదెలు పట్టాలపై రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రైళ్లు ఆలస్యంగా కూడా నడుస్తాయన్నారు. పట్టాలపై ఉండేవారిపై, గేదెలు వదిలే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని వారు తెలిపారు.

కారంపూడి నూతన ఎస్సైగా అమీర్

ప్రజాశక్తి-కారంపూడి



ఇటీవల జరిగిన ఎలక్షన్ అనంతరం కారంపూడి ఎస్సై గా విధులు నిర్వహించిన రామాంజనేయులు ను ఎలక్షన్ కమిషన్ సస్పెండ్ చేసింది. అనంతరం పిడుగురాళ్లలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న అమీర్‌ను కారంపూడి ఎస్సైగా ఎలక్షన్ కమిషన్ నియమించింది.

విజయపురిసౌత్ ఎస్ ఐ గా పట్టాభి రామయ్య

ప్రజాశక్తి - విజయపురిసౌత్



నాగార్జున సాగర్, విజయపురిసౌత్ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ ఐ గా ఎం.పట్టాభి రామయ్య సోమవారం బాధ్యతలు స్వీకరిం చారు. 2012 బ్యాచ్ కు చెందిన ఆయన స్పెషల్ బ్రాంచ్ లో ఎస్ ఐ గా విధులు నిర్వహించారు.ఇప్పటి వరకు విజయపురిసౌత్ ఎస్ ఐ గా పనిచేసిన డి వి కొండారెడ్డి ఎన్నికల్లో పలు ఆరోపణలు నేప´థ్యంలో సస్పెండ్ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ ఐ పట్టాభి రామయ్య మాట్లాడుతూ విజయపురిసౌత్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ పట్టాభి రామయ్య ను ఏఎస్ఐ లు సోమ్లా నాయక్, రామకష్ణారెడ్డి,హెడ్ కానిస్టేబుల్ సాంబ నాయక్,కానిస్టేబుల్ సురేష్ తదితరులు అభినందించారు.

వర్షపు నీటి ప్రవాహానికి అడ్డుకట్ట

ఇబ్బందిపడుతున్న స్థానికులు

ప్రజాశక్తి - తాడేపల్లి



పట్టణంలోని డోలాస్‌నగర్ ప్రాతూరు నాగ భూషణం ఆర్చి వద్ద మంగళగిరి - విజయవాడ పాత జాతీయ రహదారి పక్కన స్థానిక నివాసులు కొందరు తమ ఇళ్లముందు వర్షపు నీరు, డ్రెయినేజీ నీరు పోకుండా మట్టితో అడ్డు కట్ట వేస్తున్నారు. దీంతో, ఆ చుట్టుపక్కల నివాసం ఉంటున్నవారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొందరు చేస్తున్న ఈ చర్యల వల్ల ఇళ్లల్లో నుండి బయటకు రావడానికి కూడా వీల్లేకుండా పోయిందని పలువురు అసహనానికి గురవుతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా ఇళ్ల ముందు కాల్వలను తల పించేలా నీరుంటోందని వాపోతున్నారు. ఎమ్‌టిఎంసి అధికారులు ఈ సమస్యను సత్వరమే పరిష్కరించాలని, స్థానికులతో పాటు సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు కోరారు. ఈ విషయంపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌ను ప్రజాశక్తి వివరణ కోరగా సమస్యను మంగళవారమే పరిష్కరిస్తామని చెప్పారు.

మాచర్లలో వైసిపి నాయకుని ద్విచక్రవాహనం దగ్ధం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్



ఎన్నికల రోజు, ఆ తరువాత మాచర్ల పట్టణం, పరిసర గ్రామాలలో టిడిపి, వైసిపి వర్గాల మధ్య జరిగిన ఘర్షణలు, కోనసాగుతున్న ఉద్రికత్తలు ఇంకా చల్లారలేదు. ఎన్నికల సందర్భంగా జరిగిన రాళ్ళ దాడులు, ఇవిఎంల ధ్వంసం లాంటి ఘటనలతో మాచర్ల నియోజకవర్గం పేరు రాష్ట్రంలోనే మారు మోగుతోంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో అల్లర్లను అదుపు చేసేందుకు పెద్ద ఎత్తున పోలీసు బలగాలు ఈ నెల 15 వ తేదీ నుండి మాచర్లకు చేరు కుని పహరా కాస్తున్నాయి. అయినప్పటికి పట్టణంలో సోమవారం తెల్లవారు జామున వైసిపికి చెందిన 22వ వార్డు కౌన్సిలర్ భర్త మహంకాళి పిచ్చయ్యకు చెందిన ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. భారీ ఎత్తున మంటలు ఎగిసి పడుతుంటంతో బయటకు వచ్చిన పిచ్చయ్య దంపతులు తమ వాహ నం దగ్దం కావడం చూసి ఆశ్చర్యపోయారు. మాచర్ల నియోజకవర్గానికి జూలకంటి బ్రహ్మ నందరెడ్డి ఇన్‌ఛార్జిగా వచ్చిన నాటి నుండి టిడిపి, వైసిపి వర్గాల మధ్య పరస్పర ఘర్షణలు పెరిగాయి. ఎక్కువ దాడులు టిడిపి వారిపైన జరిగాయి. టిడిపి వర్గాలకు చెందిన నాయకులకు చెందిన, పార్టీ కార్యాలయాన్ని, అనేక వాహనాలను కూడ గతంలో వైసిపి వారు దగ్దం చేశారు. ఎన్నికల రోజు కూడ జరిగిన దాడులలో టిడిపి, వైసిపి వర్గానికి చెందిన వాహనాలు ధ్వంసం కావటం జరిగింది. వాహనాలను ధ్వంసం చేసుకోవటం అనే విష సంస్కృతి మాచర్ల నియోజకవర్గంలో అధికంగా ఉంది. పోలీసులు ఇలాంటి విష సంస్కృతిని గత రెండు ఏళ్ళుగా ఆరికట్టలేకపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు కళ్ళు తెరిచి ఈ వాహనాలను ధ్వంసం చేసుకునే సంస్కృతిని తమదైన శైలిలో ఆపాలని ప్రజలు కోరుతున్నారు.

ఘర్షణలతో కుటుంబాలకు నష్టం వాటిల్లుతుంది

గురజాల ఇన్‌ఛార్జి డిఎస్పి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - రెంటచింతల



పాల్వాయి గేటులో నిర్వహిస్తున్న కార్డన్ సెర్చ్

మండలంలోని పాల్వా యి గేటు గ్రామంలో సోమ వారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. శాంతి, భద్రతల పరిరక్షణ చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూ లన అసాంఘిక శక్తుల ఏరివేత దీనిముఖ్య ఉద్దేశమని గురజాల ఇన్‌ఛార్జి డిఎస్పి వెంకటేశ్వర రావు అన్నారు. గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించి గ్రామ స్తులతో మాట్లా డుతూ ఘర్షణలు జరిగితే కుటుంబాలకు జరిగే నష్టం గురించి వారికి వివరించారు. ఈ నెల 13న పోలింగ్ సందర్భంగా ఘర్షణలకు పాల్పడ్డ ఇద్దరు వ్యక్తులను అనుమానితులుగా గుర్తించినట్లు చెప్పారు. సరైన పత్రాలు లేని ఐదు ద్విచక్ర వాహ నాలను స్వాధీనం చేసుకున్నమన్నారు. ఎస్ఐ ఎం ఆంజ నేయులు స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -పొన్నూరు

రాష్ట్రంలో జూన్ నాలుగో తేదీన వెలువడుతున్న ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఘర్షణలు, అల్లర్లకు తావివ్వకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా పొన్నూరులో సోమ వారం అర్బన్ పోలీసులు రూట్ మార్చు నిర్వహించారు. ఐదో వార్డు డఫ్‌పేట , నాలుగో వార్డ్ మొల్లా వారి స్ట్రీట్ తదితర ప్రాంతాలలో పొన్నూరు టౌన్ సిఐ పి. భాస్కర్ ఆధ్వర్యంలో స్టేషన్ సిబ్బందితో రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ భాస్కర్ మాట్లాడుతూ పట్టణంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ రాజకుమార్, ఏఎస్ఐ పిఎమ్. సుభాని లతోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





పాడైన పబ్లిక్ టాయిలెట్

- పగిలిన సెప్టిక్‌ట్యాంక్ కనెక్షన్ పైపు
- వ్యర్థాలన్నీ పక్కనే ఉన్న ఇంట్లోకి వెళ్తున్న వైనం
- దుర్వాసనతో ఉండలేకపోతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - తాడేపల్లి

పట్టణంలోని అంబే ద్కర్ కాలనీ (యానాదుల కాలనీ)లో పేదలు విని యోగించు కునేందుకు వీలుగా పదేళ్ల కిందట ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్ పాడైంది. స్వచ్ఛభారత్ - స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌లో భాగంగా నిర్మించిన ఈ టాయిలెట్లు నేడు అపరిశుభ్రంగా తయా రయ్యాయి. సెప్టిక్‌ట్యాంక్ కనెక్షన్ కోసం ఏర్పాటు చేసిన పైపు పగిలి పోయింది. దీంతో వ్యర్థాలన్నీ పక్కనే ఉన్న కోటమ్మ ఇంట్లోకి వెళ్తున్నాయి. దుర్వాసనతో కూడిన నీరు ఇంట్లోకి వస్తుండడంతో తామిక్కడ నివాసం ఉండలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు. అన్నం తినాలన్నా ఇబ్బందిగా ఉందంటున్నారు. టాయి లెట్ల తలుపులు ఊడిపోయి వెక్కిరిస్తున్నా అధికారులకు పట్టడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్ప టికైనా మున్సిపల్ అధికారులు స్పందించాలని, టాయి లెట్‌ను బాగు చేయించడంతో పాటు తలుపులు ఏర్పాటు చేయాలని సిపిఎం స్థానిక శాఖ కార్యదర్శి డి.విజయ భాస్కర్‌రెడ్డి, వై.బర్నబాస్ డిమాండ్ చేశారు.





సుగాలీ కాలనీలో కార్డెన్ సెర్చ్ చేస్తున్న పోలీసులు

పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. సత్తెనపల్లి పట్టణంలోని సుగాలీ కాలనీలో పోలీసులు ఆకస్మికంగా సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ జి.గురునాథ్‌బాబు ఆదేశాల మేరకు పట్టణ సిఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఎన్నికల అనంతరం జరిగిన అల్లర్ల నేపథ్యంలో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ధ్రువపత్రాల్లేని 6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పట్టణ ఎస్ఐలు సత్యనారాయణ, సంధ్యారాణి ఎఎస్ఐ సుబ్బారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని బలుసుపాడులో పోలీసులు సోమవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. పోలింగ్ తేదీన ఆ గ్రామంలో గొడవలు జరిగిన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా తనిఖీలు చేపట్టినట్లు పెదకూరపాడు ఎస్సై విప్పర్ల వెంకట్రావు తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు తీసుకుంటామన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు



ప్రజాశక్తి - పెదకూరపాడు

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలుంటాయని ఎంపిడిఓ మల్లేశ్వరి అన్నారు. నాలుగో తేదీ వరకు ఎన్నికల కోడ్ ఉంటుందన్నారు. అప్పటివరకు పార్టీలు జెండాలు ప్రదర్శించరాదని, విగ్రహాలకు కప్పిన మూసుకును తొలగించరాదని స్పష్టం చేశారు. అలా తొలగించిన వారిపై ఎన్నికల కమిషన్ నిబంధన మేరకు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ నిబంధనలు అమలయ్యేలా పంచాయతీ కార్యదర్శులూ గమనించాలన్నారు.

ప్రకాశం పంతులుకు నివాళి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు డా.పి.వి.సుబ్బారావు మాట్లాడుతూ ప్రకాశం పంతులు రాష్ట్రానికి చేసిన సేవలను వివరించారు. పేదరికంలో పుట్టినా చదువుతో ఉన్నత స్థాయికి ఎదిగారని, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడే క్రమంలో ఆస్తినీ త్యాగం చేశారని అన్నారు. వైఎంసిఎ అధ్యక్షులు చుక్కా విన్సెంట్ పాల్ మాట్లాడుతూ నేటి తరం ఆయ నను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తొలుత ప్రకాశం పంతులు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో మహాత్మా జ్యోతిరావు పూలే సేవా సమితి అధ్యక్షులు యు.భాస్కరావు, కె.వెంకటేశ్వర్లు, గ్రంథాలయ ఇంచార్జ్ అధికారి ఎం.నాగుల్ మీరావలి, గ్రంథాలయ సిబ్బంది. పాఠకులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపులో ఆర్ఓల నిర్ణయమే అంతిమం

శాంతిభద్రతను నిత్యం పర్యవేక్షించాలి : పల్నాడు కలెక్టర్ లత్కర్



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జూన్ 4న నిర్వహించనున్న నేపథ్యంలో ఆయా నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు కీలక పాత్ర పోషించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్ బాలజీరావు అన్నారు. ఓట్ల లెక్కింపు ముందస్తు ఏర్పాట్లపై పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ సోమవారం సమీక్షించారు. మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రిటర్నింగ్ అధికారులు ఆయా నియోజకవర్గాలలో శాంతి బద్రతలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కౌంటింగ్ సమయంలో రిటర్నింగ్ అధికారి ఏ నిర్ణయం తీసుకుంటారో అదే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. కౌంటింగ్ సంబంధించిన పలు విషయాలను ఎన్నికల కమిషన్ పుస్తకం రూపంలో ముద్రించిందని, రిటర్నింగ్ అధికారులంతా క్షుణ్ణంగా చదివాలని సూచించారు. ఫలితాలు ప్రకటించిన అనంతరం సంబంధిత ఈవిఎంలు, వివి ప్యాట్‌లు సక్రమంగా పటిష్టమైన బందోబస్తు ద్వారా స్ట్రాంగ్ రూమ్‌లోకి చేర్చాలని, అందుకు అవసరమైన సిబ్బందిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని చెప్పారు. 4 వ తేదీన అబ్జర్వర్, పోటీలో ఉన్న వివిధ పార్టీలు ప్రతినిధుల సమక్షంలో సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూమ్ తెరవాలని, అందుకు అవసరమైన చురుకైన కౌంటింగ్ సిబ్బందిని నియమించుకోవాలి, పార్లమెంట్‌కి సంబంధించిన కౌంటింగ్ సిబ్బంది ప్రత్యేకంగా ఉండాలని నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ సిబ్బంది ప్రత్యేకంగా ఉండాలని, కౌంటింగ్ సిబ్బందికి కూడా ప్రత్యేకమైన శిక్షణ కార్యక్రమాలు ఆయా నియోజకవర్గాల స్థాయిలో నిర్వహించాలని తెలిపారు. కౌంటింగ్‌లో పాల్గొనే ప్రతి ఒక్క సిబ్బందికి కచ్చితంగా గుర్తింపు కార్డు ఉండాలని, వివిధ రాజకీయ పార్టీల పార్టీ ఏజెంట్లు కూడా కచ్చితంగా గుర్తింపు కార్డు ఉండాలని తెలిపారు. డేటా ఎంట్రీకి చురుకైన సిబ్బందిని నియమించుకోవాలన్నారు. కార్యక్రమంలో పెదకూరపాడు రిటర్నింగ్ అధికారి శ్రీరాములు, సత్తెనపల్లి రిటర్నింగ్ అధికారి మురళీ కష్ణ, చిలకలూరిపేట రిటర్నింగ్ అధికారి నారదముని, వినుకొండ రిటర్నింగ్ అధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

నేలకొరిగిన చెట్లు, స్తంభాలు



ప్రజాశక్తి-నకరికల్లు : మండల కేంద్రమైన నకరికల్లులో గాలివాన బీభత్సానికి చెట్లు కూలిపోయాయి. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. సినిమా హాలు బజారు, పంచాయతీ కార్యాలయం దగ్గర చెట్లు రోడ్డుపై పడడంతో ప్రజలు ఆసౌకర్యాన్ని గురయ్యారు. కొన్నిచోట్ల ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. సినిమా హాలు బజారు, బ్యాంకు బజారు, పొలాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో సరఫరా నిలిపివేశారు. ఇదిలా ఉండగా పగలంతా ఎండ వేడి ఉక్కపోతతో అల్లాడిపోయిన ప్రజలు మధ్యాహ్నం సమయంలో కాస్తంత వర్షానికి సేద తీరారు.

ఘర్షణలకు ప్రధాన సూత్రదారి రాంబాబే

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి నియోజకవర్గంలో జరిగిన ఘర్షణలకు ప్రధాన సూత్రదారి మంత్రి అంబటి రాంబాబు, జగన్మోహన్‌రెడ్డే కారకులని టిడిపి రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు ఆరోపించారు. సత్తెనపల్లి టిడిపి ప్రజావేదికలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. టిడిపి, జనసేన కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలను రాష్ట్ర ప్రజలందరూ చూశారని, రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ అడ్డుకోవడానికి మారణహోమం సృష్టించింది వైసిపి గూండాలేనని అన్నారు. సత్తెనపల్లిలో ఏడాది నుండి టిడిపి కార్యకర్తలపై రాళ్లతో దాడులు, అమాయకులపై అక్రమ కేసులు బనాయించి చెలరేగిన అంబటి రాంబాబు ఎన్నికల్లో కన్నా లక్ష్మీ నారాయణపై గెలవలేక పథకం ప్రకారం పోలింగ్ అడ్డుకోవడానికి వైసిపి గూండాలతో చాగంటివారిపాలెం, మాదల, ధూళిపాళ్ల, రెంటపాళ్ల, రాజుపాలెం మండలం బలిజేపల్లి గ్రామాల్లో దాడులు చేయించారని, ఓట్లు వేయడానికి వెళు తున్న టిడిపి సానుభూతి పరులపై రాళ్ళ, కర్రలతో దాడులు చేయించడమే కాక కౌంటింగ్‌కు గ్రామాల్లో నుండి అసలు బయటకు రాకుండా టిడిపి, జనసేన బిజెపి నేతలను హత్య చేసేందుకు పెట్రో బాంబులకు తెరలేపారని ఆరోపించారు. గతంలో తొండేపిలో కన్నా లక్ష్మీ నారాయణపై పోలీసుల సమక్షంలోనే దాడులు చేయించారన్నారు. అందుకే డీఎస్పీ ఆదినారాయణను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారని అన్నారు. సత్తెనపల్లిలో ఎన్నికల ఘర్షణలన్నీ అంబటి రాంబాబు కనుసన్నల్లోనే జరిగాయని, ఆయనపై ఎ1 ముద్దాయిగా కేసు నమోదు చేయాలని, నిష్పక్షపాతంగా విచారణ జరిపి వైసిపి గూండాలను అరెస్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.వెంకట కోటయ్య, టి.వెంకటరావు. ఎ.నరసింహారావు పాల్గొన్నారు.

మేలుకోకుంటే మురుగు వాసనే..



ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలోని ప్రధాన డ్రెయినేజీలన్ని చెత్త, చెదరాలతో నిండి ఉన్నాయి. వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో నీటి ప్రవాహం లేక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది, డ్రెయినేజీలు శుభ్రం చేయాలని ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. ప్రత్యేక డ్రైవ్‌లు ఏర్పాటు చేసిన కాలువలలో పూడిక తీతకు సిబ్బందిని ఉపయోగించాలని ప్రజలు కోరుతున్నారు. వర్షాలు తీవ్రం అయ్యే లోపు డ్రెయినేజీలలో పూడికలను తీయించాలని, లేకపోతే డ్రెయినేజీలు పొంగి ఇళ్లలోకి మురుగునీరు వచ్చే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. గతంలో మున్సిపల్ పర్మినెంట్, కాంట్రాక్ట్ సిబ్బంది అందరిని గ్యాంగ్ వర్క్‌గా ఏర్పాటు చేసి ప్రధాన డ్రెయినేజీలలో పూడికలను తొలగించారు. అదే తరహాలో ప్రస్తుతం కూడా డ్రెయినేజీలను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు. 13వ బ్లాక్ రైల్వే స్టేషన్ రహదారిలోని డ్రెయినేజీలకు వర్షం పడ్డ రోజున పై ప్రాంతం నుండి నీరు విపరీతంగా వస్తుంది. కాలువలో పూడిక తీయకపోతే అవి 13 బ్లాక్‌లోకి చేరి ఇళ్లలోకి వెళ్లే అవకాశం ఉంది. ప్రధాన రహదారిలోని డ్రెయినేజీలు పొంగి పొర్లితే వార్డులలోకి నీరు వెళ్ళే అవకాశం ఉంది. మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరుతున్నారు. ఇటీవల కాలంలో చెత్తకుప్పలు ఎత్తిన చోట బ్లీచింగ్ కూడ చల్లని పరిస్థితుల పట్ల ప్రజలు మున్సిపల్ అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వంతెనలు.. అదుపుతప్పితే అంతే సంగతులు..



లక్కరాజు గార్లపాడు సమీపంలో గుంటూరు బ్రాంచ్ కెనాల్‌పై రెయిలింగ్ లేని వంతెన



అమరావతి మేజర్ కాల్వపై ఉన్న వంతెన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వంతెనల వద్ద ప్రమాదాలు పొంచివున్నాయి. వంతెనలకు ఇరువువైపులా రెయిలింగ్ లేకపోవటంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు సమీపంలో ఉన్న గుంటూరు బ్రాంచ్ కెనాల్‌పై నిర్మించిన వంతెనకు ఇరువైపులా ఇనుప రెయిలింగ్ లేకపోవటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో ద్విచక్ర వాహనంపై లక్కరాజు గార్లపాడు వైపు వెళుతున్న ముగ్గురు యువకులు బైక్ అదుపుతప్పి గుంటూరు బ్రాంచ్ కాల్వలో పడి మృత్యువాత పడ్డారు. ఈలాంటి ప్రమాదాలు గతంలో అనేక జరిగాయి. అమరావతి మేజర్ కాల్వపై ఉన్న వంతెనకు ఏర్పాటు చేసిన ఇనుప రెయిలింగ్ సక్రమంగా లేకపోవడంతో పలు ప్రమాదాలు వాటిల్లాయి. మరిన్ని ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోకముందే పరిస్థితిని చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

భారీ వర్షాలతో జాగ్రత్తలు తీసుకోవాలి : కమిషనర్

ఎంటిఎంసిలో కాల్ సెంటర్ 70939 12653 ఏర్పాటు

ప్రజాశక్తి - మంగళగిరి



కమిషనర్ నిర్మల్ కుమార్

రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని, మన భద్రత శ్రేయస్సు కొరకు మనమందరం అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరని మంగళగిరి తాడపల్లి నగర పాలక సంస్థ ప్రజలందరూ కొన్ని మార్గదర్శకాలను పాటించవలసిందిగా సోమవారం కమిషనర్ నిర్మల్ కుమార్ తెలిపారు. రానున్న రోజుల్లో జిల్లా వ్యాప్తంగా భారీవర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ముందస్తు సమాచారం అందించేందుకు గాను నగర పాలక సంస్థ నుండి ప్రత్యేక కాల్ సెంటర్ (నెంబర్ - 7093912653) ఏర్పాటు చేసామని తద్వారా సత్వర పరిష్కార చర్యలు చేపడతామని స్పష్టం చేసారు. అదేవిధంగా ప్రజలు తమ తమ పరిసరాల్లో డ్రెయిన్‌లలో చెత్త చెదారం , ప్లాస్టిక్ వేయరాదని కోరారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ, వైరల్ జ్వరాలు, డయేరియా వంటి వ్యాధులు తరుచుగా వస్తాయన్నారు. ఆహారం కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు బయట ఆహారాలకు దూరంగా ఉండాలన్నారు. వర్షా కాలంలో నీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరు కాచి వడపోసిన నీరు తాగాలన్నారు. ఆహారం కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు బయట ఆహారాలకు దూరంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులకు సంబంధి ంచిన లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని హెల్త్ సెంటర్లో సంప్రదించాలన్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర సీజనల్ వ్యాధులకు సంబంధించి మందులు, పరీక్షలు హెల్త్ సెంటర్లో అందుబాటులో ఉన్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ తెలిపారు,

ముంపుకు గురయ్యే ప్రాంతలలో విద్యుత్ వైర్లు తెగి పడే ప్రమాదం ఉన్నదని అటు వంటివి గుర్తించిన యెడల వెంటనే నగర పాలక సంస్థ వారు ఏర్పాటు చేసిన సహాయక కేంద్రానికి కాల్ చేసి సమాచారం అందిచాలని తెలిపారు. మరి ముఖ్యంగా గ్రామాల పరిధిలో చెరువులు, వాగులు కోతకు గురయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు, తల్లి తండ్రులు తమ చిన్నారులను బయటకు వెళ్ళకుండా చూడవలెనని, అదేవిధంగా ముంపుకు గురయ్యే ప్రాంత ప్రజలు పైన తెలిపిన కాల్ సెంటర్‌కు ముందస్తు సమాచారం అందిస్తే తప్పనిసరిగా తగు పరిష్కార చర్యలు చేపడతామని పేర్కొన్నారు . స్థానిక నగరపాలక సంస్థ మరియు , ఆసుపత్రులు మరియు ఇతర అత్యవసర సేవల దృష్ట్యా అత్యవసర ఫోన్ నంబర్‌ల జాబితాను ప్రజలందరూ అందుబాటులో ఉంచుకోనవలసినదిగా ఆయన నగర ప్రజలను కోరారు. ఈ ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా, వర్షాకాలంలో వచ్చే ప్రమాదాలు మరియు ప్రభావాలను మనం సమిష్టిగా తగ్గించవచ్చని తెలిపారు. వర్షాల నుండి సమస్యలను ఎదుర్కోవడానికి ప్రజల అప్రమత్తత చాలా ముఖ్యమైనవని అయన స్పష్టం చేశారు.

కొండవీటివాగు వెతలు పట్టవా..?

ప్రజాశక్తి - తుళ్లూరు

వర్షాకాలం వస్తోందంటే చాలు.. రైతుల మదిలో కొండవీటి వాగు వెతలు మెదులుతాయి. వేలాది ఎకరాలలో పత్తి, మిరప, మినుము, కూరగాయలు నీటమునగడం, కోట్లాది రూపాయల నష్టం తలపుకు వస్తాయి...

తాడికొండ, మంగళగిరి నియోజకవర్గ రైతాంగానికి దుఃఖ దాయినిగా పేరొందిన కొండవీటి వాగు అభివృద్ధికి నోచుకోవడం లేదు. దశాబ్దాలుగా వాగు పొంగి పంటలను ముంచెత్తుతుండడంతో కోట్లాది రూపాయల పంట నష్టం వాటిల్లుతోంది. వాగు ఉధృతి కారణంగా పంట నష్టంతో పాటు ప్రాణ నష్టం జరిగిన ఉదంతాలు ఉన్నాయి. అధిక వర్షాల వల్ల వాగు పొంగి పైర్లు మునిగితే అరకొరగా నష్ట పరిహారం ఇచ్చి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. కొన్నిసార్లు పంట నష్టం అంచనాలు రూపొందించక పోవడం, పరిహారం ఇవ్వక పోవడం కూడా జరుగుతోంది. శాశ్వత ప్రాతిపదికన వాగు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఏళ్లుగా రైతులు కోరుతున్నా ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకోక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొండవీటి వాగు నియోజక వర్గంలోని పేరేచర్ల కొండల వద్ద ప్రారంభమై మేడికొండూరు, తాడికొండ, తుళ్లూరు, మంగళగిరి మండలాలను కలుపుతూ నదిలో కలుస్తుంది. వరద ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు వాగు పొంగి పైర్లను ముంచు తోంది. లాం, పెద పరిమి, కృష్ణాయపాలెం, వెలగపూడి, వెంకటపాలెం తదితర గ్రామాల్లోని పైర్లు నీట మునిగి నష్టం జరగడం దశాబ్దాలుగా జరుగుతోంది. పెదపరిమి దగ్గర కోటేళ్ల వాగు, చీకటివాగు, పెదపరిమి - నీరుకొండ మధ్య వాగులు, పెదపరిమి - మోతడకు వాగు, లాం వాగులపై లోలెవెల్ చప్టాలపై వరదనీరు ప్రహహించి పంటలను ముంచెత్తడంతో పాటు వాహనాల రాకపోకలకు కూడా ఆటంకం ఏర్పడుతోంది. దీంతో రాజధాని అమరావతికి రాకపోకలు నిలిచిపోయే పరిస్థితులు తలెత్తు తున్నాయి. గతంలో పెదపరిమి - నెక్కల్లు మధ్య వాగు పొంగి లో లెవెల్ చప్టా దాటుతూ వరద ఉధృతికి పెదపరిమికి చెందిన ఒక యువకుడు మృతిచెందాడు. కొండవీటి వాగు అభివృద్ధితో పాటు లో లెవెల్ చప్టా లను హై లెవెల్ చప్టా లుగా నిర్మాణం చేయాలని రైతులు దశాబ్దాలుగా చేస్తున్న విన్నపాలు పాలకుల చెవికెక్కడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజధాని నేపథ్యంలో కొండవీటి వాగు ఎత్తిపోతల పథకాన్ని టిడిపి ప్రభుత్వం సీతానగరం కరకట్ట వద్ద నిర్మించింది. వరదనీటి ఉధృతి ఎక్కువగా ఉంటే నీటిని పంపులతో ఎత్తి నదిలోకి పంపుతారు. కాల క్రమంలో వాగు మార్గంలో పూడికలు తీయకపోవడం, పిచ్చి చెట్లు, జమ్మి, తూటికాడ పెరిగిపోవడం, లో లెవెల్ చప్టాలు అభివృద్ధికి నోచుకోక పోవడం తదితర కారణాల వల్ల పంట నష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. పాలకులు ఇప్పటికైనా కొండవీటివాగు వల్ల తలెత్తే నష్ట నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



నీటమునిగిన పంట పొలాలు (ఫైల్ ఫొటో)



సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రవి,తదితరులు

ఆదర్శప్రాయులు పుచ్చలపల్లి సుందరయ్య

సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ నివాళి

ప్రజాశక్తి - తుళ్లూరు

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, పీడిత, తాడిత, ప్రజల ప్రియతమ నేత, అమరజీవి, త్యాగాలకు మారుపేరైన పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరాలకు ఆదర్శప్రాయమని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి అన్నారు. రాజధాని లోని మందడం టిడ్కో గృహ సముదాయాల వద్ద కుంభా ఆంజనేయులు అధ్యక్షతన ఆదివారం రాత్రి జరిగిన సుందరయ్య 39వ వర్ధంతి సభలో రవి మాట్లాడారు. కుల వివక్ష అంతానికి సుందరయ్య విశేషమైన కృషి చేశారని అన్నారు. సుందరయ్య తెలంగాణలో సాయుధ రైతాంగ పోరాటం ద్వారా 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేయించారని, భూస్వామ్య, జమీందారీ, రజాకార్లను తరిమికొట్టి గ్రామాలను విముక్తి చేశారని అన్నారు. పార్లమెంట్‌లో తొలి ప్రతిపక్ష నేతగా, ప్రజా సమస్యలను పార్లమెంట్ లో వెలుగెత్తి చాటిన సుందరయ్యకు నాటి ప్రజాప్రతి నిధులు ఎంతో విలువ నిచ్చే వారిని చెప్పారు. నేటి ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యలను గాలికి వదిలి నువ్వు దొంగ అంటే నువ్వు దొంగ అంటూ తిట్టుకోవడానికి పరిమితం అయ్యారని అన్నారు. ఎర్రజెండా ముద్దుబిడ్డ ఎర్రజెండాకే వన్నె తెచ్చిన సుంద రయ్య ఆశయాల స్ఫూర్తితో ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఎదుర్కొని ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ప్రజల పక్షాన నిలవ టమే సుందరయ్యకు అర్పించే నిజమైన నివాళని రవి అన్నారు. సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు గడ్డం కృష్ణ, నందాజి, ఎం నాగరాజు, వెంకటేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిషా సక్సేనా, నీర్జా భాటియా

'మధ్యవర్తిత్వం'పై న్యాయమూర్తులకు శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఎంపిక చేసిన న్యాయాధికారులకు 'మధ్యవర్తిత్వం'పై శిక్షణా తరగతులు సోమవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి శిక్షణ అధికారులుగా సుప్రీం కోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ వారు ఢిల్లీ నుండి నిషా సక్సేనా, నీర్జా భాటియాలను నియమించారు. శిక్షణాధికారులతోపాటు, నాల్గవ అదనపు జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి చైర్మన్ ఆర్.శరత్‌బాబు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి పాల్గొని మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అనేది వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయం అని, ఇరు పక్షాలు, మధ్యవర్తి సహాయంతో వివాదాలను చర్చించుకొని ఒక ఆమోదయోగ్యమైన తీర్మానానికి రావొచ్చన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన భారతదేశంలో ప్రతి వ్యక్తి న్యాయం కోసం చేసే పోరాటం ఎక్కువగా బాధిస్తుందని, దేశంలో ఇంకా అత్యధిక జనాభా అట్టడుగు, బాధిత వర్గాలుగానే ఉన్నారన్నారు. అటువంటి వారు తక్కువ ఖర్చుతో న్యాయం పొందటానికి మధ్యవర్తిత్వం బాగా ఉపయోగపడుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన సివిల్ జడ్జిలు, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న హరిబాబు, షాలెంరాజు తదితరులు

తప్పుడు తూకాలతో మోసపోతున్న వినియోగదారులు

ప్రజాశక్తి-గుంటూరు

అన్ని రకాల వస్తువుల కొనుగోలులో వినియోగదారులకు న్యాయం జరగాలంటే లీగల్ మెట్రాలజీ చట్టాలు, రూల్స్ గురించి అవగాహన కలిగి ఉండాలని లీగల్ మెట్రాలజీ రూల్స్ సవరణ కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ చదలవాడ హరిబాబు అన్నారు. సోమవారం గుంటూరులో నిర్వహించిన వినియోగదారుల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొలతల టేపులు, పెట్రోలు పోసే పంపులు, వేబ్రిడ్జిలు, సర్వేయర్లు ఉపయోగించే గొలుసులు, వాటర్ మీటర్లు, డాక్టర్లు ఉపయోగించే థర్మామీటర్లు, బిపి మిషన్లు టాక్స్ మీటర్లు, బార్ షాపులలో ఉపయోగించే పెగ్గు కొలతలపై అవగాహన కలిగి ఉంటే మోసాలు జరగవని అన్నారు.షోషల్ చేంజ్ త్రూ క్వాంటిటీ వెరిఫికేషన్ ప్రొసీజర్స్ అనే పుస్తకాన్ని డిప్యూటీ కంట్రోలర్ టి.షాలెంరాజు తన సొంత డబ్బులతో ముద్రించి వినియోగదారులకు ఉచితంగా అందించటం అభినందనీయం అన్నారు. అనంతరం టి.షాలంరాజు వినియోగదారుల అవగాహన కోసం ముద్రించిన గోడప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజిలెన్స్ కమిటీ సభ్యులు మునిపల్లి కవిత, బీరాల నాగేశ్వరరావు, గాయకోటి బేజి సరోజిని, నాగమణి తదితరులు ప్రసంగించారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు, స్థానికులు

బాలాజీ నగర్‌లో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం స్థానిక నగరాలు, బాలాజీ నగర్‌లో గుంటుపల్లి అన్నపూర్ణ, జనార్ధనరావు సేవాసంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని చిన్నారి పూర్ణిక ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నగర అధ్యక్షులు జి.రమణ, ప్రగతి మహిళా పొదుపు సంఘం నాయకులు షేక్.అసిదున్, షేక్.అప్షిప్సన్, స్థానికులు షేక్.సుబానీ తదితరులు పాల్గొన్నారు.

బత్తుల కిషోర్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - తుళ్లూరు

వైసిపి మాజీ మండల అధ్యక్షులు బత్తుల కిషోర్ జన్మ దిన వేడుకలు సోమవారం జరిగాయి. కిషోర్‌కు ఎంపి నందిగం సురేష్, ఎమ్మెల్యే మేక తోటి సుచరిత, నాయకులు కొప్పుల శేషగిరిరావు,ఆలూరి శ్రీనివాసరావు తదితరులు జన్మ దిన శుభాభినందనలు తెలి పారు.



ఎంపి సురేష్ తో బత్తుల కిషోర్

నాయకులకు అందని ఓటరు నాడి

- పెరిగిన మహిళా ఓటర్లలో చైతన్యం
- గెలుపోటములపై తీవ్ర ప్రభావం


నరసరావుపేట మండలంలోని అల్లూరివారిపాలెంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరిన మహిళలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

2024 సాధారణ ఎన్నికలు ఫలితాలపై ప్రధాన రాజకీయ పార్టీల అభ్య ర్థులంతా ఎవరి ధీమా వారు ప్రదర్శి స్తుంటే మహిళా ఓటర్లు మాత్రం ఏ పార్టీకి ఓటు వేసి ఉంటారా అని అయోమయంలో పడేస్తుంది. ఎన్నికలు ముందు గెలుపు గ్యారంటీ మెజార్టీపై లెక్కలు వేసుకుంటూ ఇన్ని వేలు, అన్ని వేలు మెజారిటీ మాకే వస్తుందని శ్రేణులలో ఉత్తేజాన్ని నింపిన నాయకులు ఎన్నికలు అనంతరం ఒక్క ఓటు తేడాతో విజయం సాధించిన చాలు అంటూ తీవ్ర ఉత్కంఠతో ఫలితాలు కోసం నిరీక్షిస్తున్నారు.నియోజకవర్గంలో ద్వితీయ శ్రేణి నాయకులు చివరి రోజుల్లో చోటు చేసుకున్న మార్పులు ఆయా పార్టీలు ఎమ్మెల్యే అభ్యర్థిలకు తలనొప్పిగా మారిందని చెప్పుకోక తప్పదు. 5 ఏళ్లుగా నియోజకవర్గంలో చేపట్టిన అభివద్ధి గడపగడపకూ అందిన సంక్షేమ పథకాలతో నరసరావుపేట నియోజకవర్గంలో మహిళలు తమకు వెన్ను దన్నుగా ఉంటా రని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపి రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేస్తుంటే ప్రజల్లో మార్పు మొదలైందని 20 ఏళ్ల చరిత్ర తిరిగి రాస్తానని ప్రభుత్వ వ్యతిరేకత తన పట్ల నియోజకవర్గ ప్రజలలో ఉన్న సానుభూతితో అత్యధిక మెజారిటీ ఓట్లతో విజయం తథ్యమని ఉమ్మడి కూటమి టిడిపి అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ధీమాగా ఉన్నారు. అత్యంత హోరాహోరీగా సాగిన ఈదఫా ఎన్నికలలో యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నరసరావుపేట నియోజకవర్గంలో మొత్తం 232778 మంది ఓటర్లు ఉండగా పోలింగ్ నిర్దేశిత సమయం ముగిసిన సమయానికి 188 701 మంది (పోస్టల్ బ్యాలెట్ కాకుండా) ఓటు హక్కు వినియోగించుకోగా పోలింగ్ శాతం 81.06 శాతం నమోదైంది. మహిళా ఓటర్లతో పాటు కొత్తగా నరసరావుపేట నియోజక వర్గంలో 10 వేల మందికి కొత్త ఓటర్లుగా గుర్తింపు పొందిన యువత అధికం కావడం వారిలో అత్యధికులు ఉమ్మడి కూటమికి మద్దతుదారులు కావడం గందరగోళం నెలకొంది. ఏ గ్రామాన్ని నిశితంగా పరిశీలించిన మిశ్రమ ఫలితాలు లభించ డంతో ఒకింత అనిశ్చితి నెలకొంది. ఎవరు గెలి చినా 3 వేల ఓట్ల లోపు ఆధి క్యత తప్ప అత్యధిక మెజారిటీ ఎవరికి సాధ్యం కాదని రాజకీయ విశ్లేషకులు అబి . ప్రాయపడుతున్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో గత ఎన్నికలలో ఇదే అభ్యర్థిపై పోటీ చేసిన డాక్టర్ గోపిరెడ్డి శ్రీని వాసరెడ్డి ఉమ్మడి గుంటూరు జిల్లా లోనే అత్యధికంగా 32276 ఓట్లతో మెజార్టీ సాధించారు. నరసరావుపేట నియోజక ´వర్గానికి ఎమ్మెల్యేగా ఓటర్లు నిర్ణ యిం చారో తెలుసుకునేందుకు ఎన్నికల కౌంటింగ్ తేదీ జూన్ 4 సాయంత్రం వరకు వేచి చూడాల్సిందే. ఎన్నికల రోజు నరసరావుపేట పట్టణంలో గతంలో ఎన్నడూ లేని విధంగా హింసాత్మక ఘట నలు చెలరేగిన నేపథ్యంలో ఫలితాలు అనంతరం నియోజకవర్గంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా మళ్ళీ అదే స్థాయిలో ఘటనలు చెలరేగే ఆస్కారం వుంటుందని చర్చ జరుగుతోంది.

ఆర్టీసీ ప్రాంగణంలో కానరాని స్వచ్ఛ భారత్

- అధ్వానంగా చిలకలూరిపేటలోని ఆర్టీసీ బస్టాండ్
- కనీస సౌకర్యాలు కరవు.. ప్రయాణికులు అవస్థలు
- చెత్తాచెదారం, గుంతలు, కొద్దిపాటి వర్షానికే నిలిచే నీరు
- దోమలు, దుర్వాసన కొడుతున్న వైనం


ఆర్టీసీ బస్టాండ్‌లోకి వెళ్లే మార్గంలో నిలిచిపోయిన వర్షపు నీరు

ప్రజాశక్తి-చిలకలూరిపేట



చెత్తాచెదారం, ఎక్కడపడితే అక్కడ గుంతలు, కొద్దిపాటి చిరుజల్లుకే నీళ్ల నిలిచిపోవడం, దోమలు, దుర్వాసన.. ఇది చిలకలూరిపేటలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం పరిస్థితి.

బస్టాండ్ కనీస సౌకర్యాలు కూడా లేవు. దీంతో, ప్రయాణికుల అవస్థలు అన్నీఇన్నీ కావు.ఎక్కడపడితే అక్కడ మల, మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో బస్టాండ్ ప్రాంగణం దుర్వాసనతో ఉంది. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్న తాధికారులు స్పందించి సరైన సౌకర్యాలు కల్పించాలని, ప్రయా ణ ప్రాంగణంలో గుంతలు పూడ్చి నీటి నిల్వ లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. బస్టాండ్‌లో బాత్రూముల ఉన్న సక్రమంగా లేవని గోడలకు, స్లాబ్‌కు పగుళ్ల ఏర్పడ్డాయి. ఎప్పుడు పడి పోతాయో తెలియని పరిస్థితి. దుర్వా సనతో నిండిపోయిన వీటిలో మూత్ర విసర్జన చేయాలంటే ఐదు రూపా యలు వసూలు చేస్తున్నారు. దుర్వా సన కొడుతున్న వాటిలోకి వెళ్లేందుకు ఇష్టపడని ప్రయాణికులు బస్టాండ్ ప్రాంగ ణంలో ఆ పనులు కానిస్తున్నారు.


అపరిశుభ్రంగా ఉన్న ప్రాంగణంలో బహిరంగ మూత్ర విసర్జన చేస్తున్న ప్రయాణికుడు


ఆర్టీసీ ప్రాంగణంలో మూసేసిన మూత్రశాల

ఆరో ప్లాంట్ చెడిపోయినా పట్టించుకోవట్లేదు

సిపిఎం నాయకులు పేరుబోయిన వెంకటేశ్వర్లు



సిపిఎం పట్టణ కమిటి కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని తాగునీరు ఆరో ప్లాంట్ చెడిపోయి సంవత్సరాలు గడుస్తున్నా దానిని పట్టించుకున్న నాథుడే లేడని అన్నారు. చెడిపోయిన ఆర్వో ప్లాంట్‌కు వెంటనే మరమ్మతులు చేయించి ప్రజలకు ఉచిత తాగునీరు అందుబాటులో ఉంచాలని అన్నారు. బస్టాండ్ ప్రాంగణంలో ని గుంతలను వెంటనే పూడ్చాలని, వాష్ రూమ్‌లో మూత్రవిసర్జనకు డబ్బులు వసూలు చేయ కుండా తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



ఇంటింటి సర్వే త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-పెదకూరపాడు

ఇంటింటి సర్వే త్వరగా పూర్తి చేయాలని పెదకూరపాడు మండల అభివృద్ధి అధికారి మల్లేశ్వరి కోరారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతి కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత మరుగుదొడ్లు సర్వే చేయాలన్నారు. మరుగుదొడ్డి ఉంటే ఏ రకము ఉందనే విషయంతో పాటు పూర్తి వివరాలు సేకరించి త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డి శ్రీనివాసరావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కాశిరెడ్డి పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా వ్యాపారుల ధరలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్


మాట్లాడుతున్న పాల్ రాజ్

నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేయాలని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు జిల్లెల్ల పాల్‌రాజ్ డిమాండ్ చేశారు. సత్తెనపల్లిలో పాల్ రాజ్ సోమవారం మాట్లాడుతూ గత పది రోజులు నుంచి 144 సెక్షన్ విధించడం వలన వ్యాపారాలు పూర్తిగా స్తంభించిపోయాయని, సోమవారం నుండి వ్యాపారాలు నిర్వహించు కునేం దుకు వెసులు పాటు కల్పించారని అన్నారు. ఇదే అదు నుగా భావించిన వ్యాపా రులు నిత్యావసర సరుకుల ధరలను అమాంతం పెంచారని అన్నారు. పనులు లేక సామాన్య ప్రజలు ఆర్థికంగా ఇబ్బంది పడుతుంటే ధరల భారం ప్రజలపై పిడుగుపడ్డట్టు అయిం దని చెప్పారు. వ్యాపారులు తమ ఇష్టానుసారం ధరలు పెంచ కుండా అధి కారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్య క్షులు వై.రాజు, మండల కార్యదర్శి కె.రమేష్ బాబు, అంబే ద్కర్ యువజన సంఘం పట్టణ ఉపాధ్యక్షులు ఎన్.రవి పాల్గొన్నారు.


ఆంథోనిని సన్మానిస్తున్న దళిత ప్రజాసంఘాల నాయకులు

దళితులను చైతన్యవంతులను చేసిన కొరబండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సమాజంలో దాగివున్న రుగ్మతలను రూపుమాపడంతో పాటు దళితులను చైతన్యవంతులను చేయడంలో కొరబండి అంథోని ఎనలేని కృషి చేశారని సత్తెనపల్లి మార్కెట్ యార్డు చైర్మన్ పెండెం బాబురావు కొనియాడారు. దళిత మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి ఆంథోని 70 వ పుట్టినరోజు వేడుకలు సత్తెనపల్లిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పలువురు ఆంథోనీ కి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అంథోని, విజయ లక్ష్మి దంపతులను పలువురు పూలమాలలు, దుశ్శాలు వాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆంథోనీ మాట్లాడుతూ డాక్టర్.బి.ఆర్. అంబేద్కర్ ఆలోచన విధానాన్ని అనుసరించి బహుజనులు ర్యాజ్యాధికారం దిశగా పయనిస్తూ, ఆత్మగౌరవంతో ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, న్యాయవాది దాసరి జ్ఞాన్ రాజ్ పాల్, జైభీమ్ రావ్ భారత్ పార్టీ సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి, జొన్నలగడ్డ విజయ్ కుమార్, ప్రజా సంఘాల నాయకులు దావు లూరి కోటేశ్వర రావు, జిల్లేల పాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయాలను సందర్శించిన కేంద్ర బృందం

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలోని పలు గ్రామాలలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ కేంద్ర బృందం సభ్యులు పర్యటించారని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె జ్యోతి తెలిపారు. సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్, ఎస్ డబ్ల్యూ యు పి సి షెడ్, జగనన్న కాలనీ పర్యవేక్షించిన బృంద సభ్యులు ప్రభుత్వ విధానాలు బాగున్నాయని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని అన్నారు. వీరు గ్రామదర్శినిలో భాగంగా మండలాన్ని సందర్శించడం జరిగిందని అన్నారు. వేజెండ్ల గ్రామంలోని రైతు భరోసా కేంద్రము, (ఆరోగ్య కేంద్రం) హెల్త్ క్లినిక్, గ్రామ సచివాలయం సందర్శించి అవి పని చేయు విధానము వాటి ద్వారా ప్రజలకు అందించే సేవలు గురించి పరిశీలన చేయటం జరిగిందని తెలిపారు. చేబ్రోలు గ్రామంలో సాలిడ్ వెల్త్ ప్రాసెస్ సెంటర్) షెడ్డు సందర్శించి ఘన వ్యర్థాల నిర్వహణ మరియు చెత్త నుండి సంపద సృష్టి మరియు పారిశుధ్యం, ఆరోగ్యం తదితర అంశాల గురించి కూలంకుశంగా పరిశీలించడం జరిగిందని తెలిపారు. అనంతరం మంచాల గ్రామంలో జగనన్న కాలనీని సందర్శించి పేదలందరికీ ఇల్లు నిర్మాణ విధానము గురించి పర్యవేక్షించటం జరిగింది అన్నారు. కార్యక్రమంలో ఈవో పిఆర్ అండ్ ఆర్ డి జి శ్రీనివాసరావు, పంచాయితీ కార్యదర్శులు ఎం శ్రీనివాసరావు, బి ప్రశాంతి,పద్మ, జి శ్రీనివాసరావు ,ఎస్ బి ఎం మండల కోఆర్డినేటర్ జి ప్రసాద్ రావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్ వరకు హద్దు మీరితే చట్టపరంగా చర్యలు

ప్రజాశక్తి - చేబ్రోలు



చేబ్రోలులో రాజకీయ పార్టీల శ్రేణులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

ఎన్నికల ఫలితాలు వచ్చేంతవరకు గ్రామాల్లో ఎక్కడైనా అల్లర్లు గొడవలు రెచ్చగొట్టే విధానాలు జరగకూడదని, బంకు యాజమాన్యం పెట్రోల్ మరియు డీజిల్ వాహనాలకు కాకుండా విడిగా అమ్మ రాదని పోలీసు అధికారులు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల ఫలితాల తేదీ దగ్గర పడుతుండటంతో ప్రజలకు శాంతి విఘాతం కలుగకుండా పలు చర్యలు తీసుకోవడం జరిగిందని చేబ్రోలు ఎస్ఐ పి మహేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐపిఎస్ మనోజ్ కుమార్ హెగ్డే మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వచ్చేంతవరకు రాజకీయ పార్టీ నాయకులకు కార్యకర్తలకు మరియు పెట్రోల్ బంకుల యాజమా న్యాలకు ప్రజా శాంతి కోసం పలు ఆదేశాలు చేయటం జరిగిందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ, వైఎస్ఆర్సిపి పార్టీ కార్యలయాలను ఆయన సందర్శించి, అందరూ ప్రజాశాంతికి సహకరించాలని పార్టీ శ్రేణులను కోరడం జరిగిందని అన్నారు. రానున్న 2024 ఎన్నికల ఫలితాలు కౌంటింగ్ రోజున ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు, గొడవలు, అల్లర్లు అలజడులు సృష్టించ కూడదని, సమాజంలో ప్రజా శాంతికి ఎలాంటి భంగం కలిగించకూడదని రాజకీయ పార్టీ నాయకులకు కార్యకర్తలకు సూచించడం జరిగింది అన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధముగా ఎవరైనా హద్దు మీరితే చట్టపరంగా చర్యలు తీసుకొని కేసులు పెడతామని అయన హెచ్చరించారు. మండలంలో ఎటువంటి అల్లర్లకు, గొడవలకు వెళ్లవద్దని, ఒకరినొకరు రెచ్చగొట్టుగోవద్దని రాజకీయ పార్టీల నాయకులు కార్యకర్తలకు హితవు చెప్పారు. అలాగే మండలంలో పెట్రోల్ బంక్ లను సందర్శించి బంకు ఓనర్లకు పలు రకాల ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఫలితాలు వచ్చేంతవరకు వాహనాలలో మాత్రమే పెట్రోలు/డీజిల్ నింపాలని, విడిగా బాటిళ్లలో, డబ్బాల్లో ఎవరికీ పోయవద్దని సూచించడం జరిగిందని అన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు అయ్యేవరకు ఈ నిబంధనలను పాటించాలని తెలియజేసారు. ఎవరైనా పెట్రోలు బంకు యజమానులు ఈ నిబంధనలను అతిక్రమిం చినట్లటే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని బంక్ లైసెన్స్ కూడా కాన్సిల్ చేస్తామని చెప్పారు.


ఆర్టీసీ కార్మిక నాయకులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులపై అక్రమ సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దండా లక్ష్మీనారాయణ, వై.నేతాజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ యాజమాన్యం కార్మికులను, కార్మిక నాయకులను చీటికిమాటికి సస్పెన్షన్ చేస్తుందని అన్నారు. ఎన్నికల సమయాన్ని అదునుగా చేసుకొని ప్రశ్నించే నాయకులను ఏదో ఒక సాకుతో ఇబ్బంది పెట్టే ప్రయత్నం మానుకోవాలని డిమాండ్ చేశారు. మే నాలుగో తేదీన ఏలూరులో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారనే సాకుతో ఆర్టీసీ యాజమాన్యం ఎస్.డబ్ల్యూ.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుందర్రావును , బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంసన్, ఎన్.ఎం.యు తణుకు డిపో కార్యదర్శి సుబ్బారావును సస్పెండ్ చేయడాన్ని సిఐటియు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత యాజమాన్యం ఆగడాలు మితిమీరిపోతున్నాయని, కార్మిక సంఘాలు యాజమాన్యాన్ని విమర్శించడమే నేరమన్నట్లుగా ఆర్టీసీ యాజమాన్యం ప్రచారం చేస్తుందని తెలిపారు. ఆర్టీసీలో జరుగుతున్న ప్రైవేటీకరణ, కార్మికులకు ఓల్డ్ పెన్షన్ స్కీమ్ ఎత్తివేత, సిపిఎస్ రద్దు వంటి అంశాలపై బలంగా మాట్లాడిన నాయకుల పట్ల కక్ష సాధింపు ధోరణితో యాజమాన్యం వ్యవహరించడం సరికాదని కోరారు. సస్పెన్షన్ ఎత్తివేయకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.

మెట్టు శ్రీనివాసరెడ్డికి అన్నమయ్య పురస్కారం

ప్రజాశక్తి - చేబ్రోలు



కళా రంగంలో ఇచ్చే అన్నమయ్య పురస్కారానికి 2024కి తాను ఎంపిక కావడం సంతోషంగా ఉందని స్థానిక ఉపాధ్యాయుడు మెట్టు శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. 26వ తేదీన చిత్తూరు జిల్లాలో సంస్థ ఏడవ వార్షికోత్సవం మరియు కీర్తిశేషులు కాత్యాయని జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అయన తెలిపారు. ఈ కార్యక్రమం సంప్రదాయ కళల పరిరక్షణ సంస్థ మరియు ఎ ఎస్ ఫౌండేషన్ తిరుపతి సంయుక్తంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. కళా రంగంలో విశేష కృషి చేసిన అపార అనుభవము గడించిన 116 మందికి అందజేయడం జరుగుతుందని అన్నారు.

అవుట్‌సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

గుంటూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్టులో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన మూడు సబార్డినేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ కేటగిరి (ఓసి) 1, ఇడబ్ల్యూఎస్-1, బిసి-బి (ఉమెన్)-01 పోస్టులకు ఈనెల 23వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు 7వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్హతలు కలిగి వుండాలని, టెక్నికల్ క్వాలిఫికేషన్లు, డ్రైవింగ్, ఎలక్ట్రికల్ , కార్పెంటర్, ప్లంబింగ్, గార్డెనింగ్, మెషినరీ వర్క్సులో అనుభవం వున్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు 18 నుండి 42 ఏళ్లలోపు వయస్సు కలిగి వుండాలని, ఎస్.సి , ఎస్.టి , బీసీ అభ్యర్థులకు వయస్సు సడలింపు ఉంటుందన్నారు. దివ్యాంగులు, మాజీ సైనికులకు పది సంవత్సరాల సడలింపు ఉంటుందన్నారు. ఓరల్ ఇంటర్వ్యూ ద్వారా నియామకాలు చేపట్టడం జరుగుతుందని , ఎంపికైన వారు ఫ్యామిలీ కోర్టు కం అడిషనల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ కోర్టులో పనిచేయాల్సి ఉంటుందని, వీరికి రెమ్యూనరేషన్ నెలకు రూ.12,000లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

అవగాహన ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం వర్ధంతి

ప్రజాశక్తి-గుంటూరు



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అవగాహన సభ్యులు

సమాజ అభ్యుదయం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహామనిషి టంగుటూరి ప్రకాశం అని వక్తలు పేర్కొన్నారు. సోమవారం అరండల్‌పేట లోని అవగాహన సంస్థ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విద్యావేత్త ఇ.చంద్రయ్య మాట్లాడుతూ తెలుగు వారి హృదయాలపై చిరస్మరణీయంగా నిలిచిన ఉద్దండులు టంగుటూరి ప్రకాశం పంతులు అని పేర్కొన్నారు. తెలుగు జాతీయతకు ప్రతీకగా ఆంధ్రప్రదేశ్ నిర్మాతగా పేరు పొందారన్నారు. కనికరం ఎరుగని బ్రిటీషు తుపాకికి గుండెలు చూపించిన ధైర్యశాలి ప్రకాశం ఆంధ్రకేసరిగా కీర్తిగడించారన్నారు. విశ్రాంత ఆచార్యులు సి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ మహాత్మాగాంధీ అత్యంత నమ్మకంతో తన నిజమైన వారసుడిగా ప్రకాశం పంతుల్ని గుర్తించారన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం సర్వస్వం త్యాగం చేసిన ప్రకాశం జాతీయోద్యమంలో ముందువరుసలో నిలిచారన్నారు. ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా, నవ్యాంధ్ర నిర్మాతగా అతి కొద్దికాలంలోనే అనేక అభివృద్ధి, ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టి ప్రజాదరణ పొందారన్నారు. హైకోర్టు స్థాపన, నాగార్జున సాగర్ ప్రాజెక్టు, వెంకటేశ్వరా యూనివర్సిటీ, కొన్ని పన్నుల రద్దు వంటివి ప్రకాశం చొరవతోనే సాధ్యం అయ్యాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాది అవధానుల హరి, కొండా శివరామిరెడ్డి, సదాశివం తదితరులు పాల్గొన్నారు.

23న కుట్టు శిక్షణ ముగింపు సభ

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) వారి సహకారంతో పెదనందిపాడు తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో గత మూడు నెలలుగా నిర్వహిస్తున్న మహిళా కుట్టు శిక్షణ ఈ నెల 23తో ముగుస్తుందని విజ్ఞాన్ కేంద్రం ట్రస్ట్ కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు సోమవారం తెలిపారు. 23 ఉదయం 10 గంటలకు ముగింపు సభ జరుగు తుందని ఈ సభలో ముఖ్య అతిథులుగా శాసనమండలి సభ్యులు కె ఎస్ లక్ష్మణరావు ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి, గుర్రం జాషువా మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు దాసరి శేషగిరిరావు, మాజీ ఎంపీపీ ముద్దన నగరాజకుమారి, నర్రా బాలకృష్ణ, పి.ఎ.ఎస్.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గుర్రం వీరరాఘవయ్య తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

సిబిఎస్సి పాఠశాలల రాష్ట్రవ్యాప్త శిక్షణ కార్యక్రమంలో భాగంగా గుంటూరు, బాపట్ల జిల్లాలలోని సీబీఎస్సీ పాఠశాలల్లో పనిచేస్తున్న గణితం ఫిజిక్స్, కెమిస్ట్రీ పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయులకు స్ట్రక్చరల్ లెసన్ ప్లాన్, పెడగాగి అంశాలపై గుంటూరులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రెండ్రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రభుత్వ పాఠ్యపుస్తకాల డైరెక్టర్, జిల్లా పరిశీలకులు కే.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతుందని, ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలు మెరుగవుతాయని అన్నారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థి అని, బోధించే పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవడానికి శిక్షణా కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈ రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి అందరి సహాయ సహకారాలు అవసరమని అన్నారు. జిల్లా విద్యాశాఖధికారి పి.శైలజ మాట్లాడుతూ గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ బోధించే ఉపాధ్యాయులు ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా ఆయా సబ్జెక్టులలో నిష్ణాతుల వుతారన్నారు. ఉపాధ్యా యులు తాము బోధించే పాఠ్యాంశాలపై పట్టు కలిగి ఉండాలని, గణితం బోధించే ఉపాధ్యాయులు పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండి, విద్యార్థులకు ఆసక్తికరంగా బోధిస్తూ గణితం పట్ల వారికి ఉన్న భయాన్ని తొలగించి ఆసక్తికరంగా బోధించాలని అన్నారు. కార్యక్రమంలో గుంటూరు ఉప విద్యాశాఖధికారి ఏ.వెంకటేశ్వరరావు, సిమ్యాట్ నుంచి వచ్చిన పరిశీలకులు ఏ. సుహాసిని, కోర్స్ ఇంచార్జ్, గుంటూరు మండల విద్యాశాఖధికారి వి.వెంకటేశ్వరరావు, ఉర్దూ డి.ఐ, ఎం.డి. ఖాసిం, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఏసీ కాలేజి ఎదురుగా ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో మే 15 నుండి జూన్ 7వ తేదీ వరకూ నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో కొనసాగుంది. దీనిలో భాగంగా సోమవారం విద్యార్థులకు ఎటువంటి బట్టీ విధానం లేకుండా లాటిక్‌గా టేబుల్స్ ఎలా చెప్పాలో వివరించారు. మనం వాడుకలో వాడే వారాల పేర్లు ఎలా ఏర్పడ్డాయో వాటి వెనుక ఉన్న లాజిక్ గురించి చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎన్.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎఎన్‌యు డిగ్రీ 6వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 10వ తేదీ వరకు నిర్వహించిన డిగ్రీ కోర్సుల 6వ సెమిస్టర్ ఇంటర్న్ షిప్ ఫలితాలను విడుదల చేసినట్లు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి. రాజశేఖర్ సోమవారం తెలిపారు. బి ఏ, బి కామ్, బీఎస్సీ, బీసీఏ, బి బి ఏ, బిఏ ఓఎల్ కోర్సుల ఫలితాలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణ అధికారి రెడ్డి ప్రకాష్ రావు మాట్లాడుతూ 6వ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి 23,450 మంది హాజరవగా 23,240 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఫలితాలను విశ్వవిద్యాలయ వెబ్ సైట్‌లో పొందుపరిచామని చెప్పారు. కార్యక్రమంలో రెక్టర్ ఆచార్య పి . వరప్రసాద్ మూర్తి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి. సిద్దయ్య, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ బట్టు నాగరాజు, డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సంధ్య కోలే, సిటిఏ ప్రొఫెసర్ సత్యనారాయణ, ఏ సి టి ఏ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఎఎన్‌యు ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్ గడువు తేదీని పొడిగించినట్లు అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జి. అనిత తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జూన్ 12వ తేదీలోగా ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సెల్ఫ్ సపోర్ట్ విధానంలో ఈ కోర్సులను అందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ టెస్ట్ ద్వారా బి.టెక్ ప్లస్ ఎం.టెక్ డ్యూయల్ డిగ్రీ ఇంజనీరింగ్ విద్యను వర్శిటీ అందిస్తుందని పేర్కొన్నారు. సిఎస్ఈ, ఈసిఈ, ఎమ్ఈ, సిఈ, ఇఇఇ, ఈసిఈ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంజనీరింగ్, మెషీన్ లెర్నింగ్, బ్యాచిలర్ ఆఫ్ డిజైన్, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తామని డాక్టర్ అనిత తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించి ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఏ ఎన్ యు అడ్మిషన్ల విభాగాన్ని సంప్రదించ వచ్చునని లేదా యూనివర్సిటీ వెబ్సైట్ అనుసరించి దరఖాస్తులు చేసుకోవచ్చని డాక్టర్ అనిత వివరిం చారు.



కత్రిమ చేతులు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా కృత్రిమ చేతులు పంపిణీ

- 7 రోజులు పాటు కొనసాగింపు
- 300 మంది లబ్దిదారులకు కృత్రిమ చేతులు ఏర్పాటు

ప్రజాశక్తి మంగళగిరి

చేతుల్లేని వికలాంగులకు అధునాతన కృత్రిమ చేతులను ఉచితంగా అందించే బహత్తర ప్రాజెక్టు బాధ్యతను రోటరీ ఇంటర్నేషనల్ చేపట్టిందని నిర్వాహకులు తెలిపారు. నిరుపేదలు మరియు వికలాంగులైన లబ్ధిదారులకు సుమారు 300 జెమ్ ఎంకే1 మొత్తంగా ఈ ప్రాజెక్టు సుమారు 1.35 కోట్ల రూపాయలు ఖర్చవుతుంది అని తెలిపారు. కృత్రిమ చేతులను జర్మనీ దేశం నుంచి దిగుమతి చేసుకుని మంగళకరం 2024 పేరిట ఉచితంగా అందించే ప్రతిష్టాత్మక సర్వీసు ప్రాజెక్టును అమలు చేస్తున్నామన్నారు. గత డిసెంబరులోఎల్ఎన్4 ప్రాజెక్టును విజయవం తంగా నిర్వహించిన స్ఫూర్తితో సోమవారం సోమవారం స్థానిక వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 పీడీజీ డాక్టర్ రవి వడ్లమాని, డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ కె.శరత్ చౌదరి, డిస్ట్రిక్ట్ గవర్నర్ నామిని డాక్టర్ ఎస్.వి.రామప్రసాద్, పీడీజీ అన్నె రత్నప్రభాకర్, ఐపీడీజీ తాళ్ల రాజశేఖర్ రెడ్డి, పీడీఆర్ఆర్ వేణుగోపాల్ యలమంచిలి, వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కాలేజ్ గౌరవాధ్యక్షులు డాక్టర్ గోలి రామ్మోహనరావు, ది హ్యాండ్ ప్రాజెక్టు వ్యవస్థాపకులు క్రిస్ గల్లీ (జెర్మనీ), మంగళగిరి రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ అందె రేవంత్, సెక్రటరీ గాజుల శ్రీనివాసరావు, ట్రెజరర్ నూతలపాటి వెంకటేశ్వరరావు తదితరులు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో పీడీజీ డాక్టర్ రవి వడ్లమాని మాట్లాడుతూ మంగళగిరి రోటరీ క్లబ్ వారు కృత్రిమ చేతుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడంపై ముందుగా అభినందనలు తెలియజేస్తున్నాను. వారం రోజులపాటు నిర్వర్తించే ఈ సర్వీసు ప్రాజెక్టులో లబ్ధిదారులకు అందించే ఈ కృత్రిమ చేతులను జర్మనీ సంస్థ నుంచి తెప్పించడం జరిగిందన్నారు. వీటిని అమర్చేందుకు జర్మనీ దేశంనుంచే కాకుండా న్యూజిలాండ్, ఆఫ్రికాలోని పలు దేశాలనుంచి వైద్య బృందం విచ్చేసిందన్నారు. మంగళకరము అనే ఈ ప్రాజెక్టు ఏడు రోజులపాటు సుమారు 300 మంది లబ్ధిదారులకు కృత్రిమ చేతులను అమర్చుతారని రవి వడ్లమాని తెలిపారు.

ఓట్ల లెక్కింపునకు పటిష్ట బందోబస్తు

మీడియా సమావేశంలో పల్నాడు జిల్లా ఎస్పి మల్లికా గార్గ్



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న పల్నాడు ఎస్‌పి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రం వద్ద అదేవిధంగా పల్నాడు జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు పల్నాడు జిల్లా మలికా గార్గ్ అన్నారు. సోమవారం పల్నాడు జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన మలికా గార్గ్ స్థానిక ఎస్పీ కార్యాలయంలో సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ శ్రీలత్కర్ శ్రీకేష్ బాలాజీరావును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియాతో ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం రానున్న ఓట్ల లెక్కింపు సందర్భంగా పల్నాడు జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రత ఏర్పాట్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాలలో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేస్తామని తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉన్నప్పుడు ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు, టపాసులు కాల్చడం, సభలు, సమావేశాలు, ర్యాలీలు పూర్తిగా నిషేధమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రమైన జె.ఎన్.టి.యు కళాశాలలో భద్రపరిచిన ఈవిఎం లతో పాటు కళాశాల పరిసర ప్రాంతాలపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు, లెక్కింపునకు హాజరయ్యే అధికారులు నిషేధిత వస్తువులు అయిన అగ్గిపెట్టెలు, లైటర్, ఇంక్ బాటల్స్, పేలుడు కారణం అయ్యే ఎలాంటి వస్తువులను లెక్కింపు కేంద్రాలలోకి అనుమతించమన్నారు. ఎలక్షన్ కమిషన్ ద్వారా జారీ చేయబడిన గుర్తింపు కార్డులు ఉన్న వారిని మాత్రమే లెక్కింపు కేంద్రంలోకి అనుమతి ఉంటుందన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో పర్యటించడంతో పాటు ఆయా ప్రాంత ప్రజలకు ఎన్నికల నియమావళిపై తమ సిబ్బందిచే ఎన్నికల వివాదాలలో పాల్గొంటే తీసుకొను చట్టపరమైన చర్యల గురించి అవగాహన కల్పిస్తామన్నారు. పల్నాడులో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహ కరించాలని, పోలీసులు కూడా నిష్పక్షపాతంగా పనిచేయాలని కోరారు.

బాటిల్స్‌లో పెట్రోలు పోయటం నిషేధం

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో బాటిల్స్‌లో పెట్రోల్ పోయడం నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. పెట్రోల్ బంకుల్లో బాటిల్స్‌లో పెట్రోల్ పోసి ఆదేశాలు ఉల్లంఘిస్తే సివిల్ సప్లయిస్ అధికారులు వారి లైసెన్స్‌ల నిలుపుదల చేస్తారని స్పష్టం చేశారు. తెనాలి సబ్ కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారి , గుంటూరు , జిల్లాలోని మండల తహశీల్దార్లు తమ పరిధిలో ఏమైనా ఉల్లంఘనలు జరిగినట్లు తమ దష్టికి వస్తే జిల్లా యంత్రం గానికి తెలియజేయాలన్నారు. ఎవరైనా ఆదేశాలు ఉల్లంఘించిన ఎడలా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి హెచ్చరించారు.

అధిక మొత్తంలో బాణసంచా విక్రయాలు నిషేధం..

జిల్లాలో జూన్4వ తేది కౌంటింగ్ అనంతరం గెలుపొందిన అభ్యర్థులు ఊరేగింపులు, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేనందున, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా వుండేందుకు అధిక మొత్తంలో బాణాసంచా విక్రయాలు నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. అధిక మొత్తంలో బాణా సంచా విక్రయాలు చేయవద్దని హెూల్‌సేల్ డీలర్లను ఆదేశిచటం జరిగిందన్నారు. ఆదేశాలు ఆదేశాలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

గుంటూరు నగరంలో ట్రాఫిక్





అస్తవ్యస్తంగా గుంటూరు ట్రాఫిక్

- వాహనాల నియంత్రణ కంటే వసూలుపై దృష్టి
- ఏళ్ల తరబడి ఒకే స్థానంలో తిష్టవేస్తున్న సిబ్బంది
- అడ్డదిడ్డంగా వాహనాల రాకపోకలతో ప్రజలకు తప్పని ఇబ్బందులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి. వాహనాల క్రమబద్ధీకరణ కన్నా వసూళ్లపైనే అధికారులు, సిబ్బంది ఎక్కువగా దృష్టిసారిస్తున్నారు. ప్రజల ఇబ్బందు లను పట్టించుకోకుండా కేవలం ఉన్నతాధికారులు, న్యాయమూర్తులు, విఐపిలు పర్యటించే మార్గాలలో దృష్టి పెట్టి ట్రాఫిక్ విభాగం అధికారులు చేతులు దులుపుకొం టున్నారు. కూడలి ప్రదేశాలను మూసివేయడం వల్ల వాహనాలన్నీ రాంగ్ రూట్‌లో వస్తున్నా పట్టించుకునే నాథుడు లేరు. రాజకీయ నాయకులకు, పై అధికారులకు మామూళ్లు ఇచ్చుకుని ట్రాఫిక్ విభాగంలో పోస్టింగ్ పొందుతున్న అధికారులు, సిబ్బంది ప్రజల నుంచి వివిధ రూపాల్లో వసూళ్లకు పాల్పడుతు న్నారు. రహదారుల విస్తరణ చేసిన ప్రాంతాల్లో కూడా ఇష్టారాజ్యంగా తినుబండారాల స్టాల్స్‌కు అనుమతి ఇస్తున్నారు. వీటి నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల సమయంలో కూడా వాహనదారుల నుంచి ఇష్టారీతిన వసూళ్లకు పాల్పడుతున్నారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి నగరంలోకి వస్తున్న ఆటోలు, ప్రయాణికులను చేరవేసే ఇతర వాహనదారుల నుంచి నెలవారీ మూమూళ్లను తీసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదం జరిగితే స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు భారీగా ముడుపులు దండుకుంటున్నా పట్టించుకునే నాథుడు లేరు. ప్రమాద తీవ్రత ను బట్టి కనీసం రూ.25 వేలనుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగితే ప్రమాదం జరిగిన వారి వద్ద సొమ్ము తీసుకుని రాజీ చేయడం, ఇద్దరిపైనా కేసులు కడతామని బెదిరించడం పరిపాటిగా మారింది. వసూళ్లపై ఉన్న శ్రద్ధ ట్రాఫిక్ నియంత్రణపై ఉండటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. కొంతమంది ఏళ్ల తరబడి ఒకే సీటులో తిష్టవేసి కీలకమైన పోస్టుల ద్వారా దండుకుంటున్నారు. తూర్పు సర్కిల్ పరిధిలో రైటర్ అవినీతి ఆరోపణల నేపథ్యంలో గత ఎస్పి ఆరీఫ్ హఫీజ్ తీవ్రంగా మందలించారు. నీపై వస్తున్న ఫిర్యాదులన్నీ పరిశీలిస్తే తీవ్ర చర్యలు తీసుకోవాల్సి వుంటుంది. తక్షణం నువ్వు ఇక్కడ నుంచి వెళ్లిపో అంటూ మంగళగిరికి బదిలీ చేశారు. రోడ్లపై అక్రమంగా వసూళ్లకు పాలపడుతున్న 15 మంది హోంగార్డులను విధుల నుంచి తొలగించారు. వీరంతా ఇచ్చిన సమాచారం మేరకు తూర్పు సర్కిల్‌లో కీలకమైన రైటర్‌పై కూడా ఎస్‌పి చర్యలు తీసుకున్నారు. మంగళగిరికి బదిలీ చేశారు. ఎస్‌పి శెలవులో ఉండగా ఆయన వెంటనే తిరిగి మంగళగిరి నుంచి గుంటూరుకు యథాతథ స్థానానికి చేరుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి, హిందూకళాశాల జంక్షన్‌లో పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద సిటీ బస్సులను ఎక్కువ సేపు నిలుపుదల చేయడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందిఏర్పడుతోంది. ప్రభుత్వ ఆస్పత్రిలోపలికి అంబులెన్సులు వెళ్లాలన్న ఇబ్బందిగా ఉంటోంది. శంకరవిలాస్ ఓవర్ బ్రిడ్జి నుంచి దిగువకు వస్తున్న వాహనాలు మార్కెట్ వైపు వెళ్లేందుకు సిటీబస్సుల నిలుపుదల వల్ల ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఇబ్బంది కలుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. గుంటూరులో సిటీ బస్సులు, ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ఎక్కడబడితే అక్కడ ఆపివేస్తున్నారు. గుంటూరు ఆర్‌టిసి బస్టాండ్ చుట్టూ ట్రావెల్స్, టూరిస్టు బస్సులు ఇబ్బడి ముబ్బడిగా ఆపి వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. పొన్నూరు రోడ్డు ప్రారంభంలో కోడిగుడ్డు సత్రం వద్ద కూడా వాహనాలను ఎక్కడిబడితే అక్కడ నిలిపివేసి ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తున్నాయి.